క్లుప్తంగా

ముస్లిం మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న రమణ

బొండపల్లి: రంజాన్‌ను పురస్కరించుకుని గొట్లాం గ్రామంలో గజపతినగరం నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు మహంతి రమణ 15 కుటుంబాల్లోని ముస్లిం మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రమణ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి వెండి ఆభరణాలు బహూకరణ



ఆలయ ధర్మకర్త,అర్చకుడికి ఆభరణాలు, మైక్ సెట్‌ను అందజేస్తున్న దాతలు

కొత్తవలస: మండలంలోని గిడిజాల రోడ్డులోని గరుడాద్రి కల్యాణ వేంటేశ్వరస్వా మి ఆలయంలో స్వామి వారికి మండల కేంద్రానికి చెందిన భక్తులు వెండి ఆభరణాలను సోమవారం బహూకరించారు. భక్తురాలు కోట ఉమశ్రీ స్వామివారి కి వెండి నామాలను, విన్నకోటి సురేష్ 650 గ్రాముల హారం అందించారు. అలాగే విన్నకోటి శ్రీరామ్మూర్తి మైక్‌సెట్ ను, జి.రామకృష్ణ ఎలక్ట్రిక్ ఢమరకాన్ని అందజేశారు. దాతలకు ఆలయ ప్రధాన అర్చకులు ఐ.వి.సతీష్, ఆలయ ధర్మకర్త బోని వెంకటప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ కమిటీ సభ్యులు కాకర గౌరీకుమార్, డొంకాడ ప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



పోటీలో తలపడుతున్న చిన్నారులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు స్థానిక ఎఫ్‌ఆర్‌సీలో సోమవారం నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. సబ్‌జూనియర్స్ విభాగంలో పి.దన్విర్, బి.మోక్షిత, జూనియర్స్ విభాగంలో పి.నేహ, ఎల్.మౌనిష్, మినీ జూనియర్స్‌లో సీహెచ్.అలేఖ్య, పి.జస్మిత, సీనియర్స్ సింగిల్స్‌లో పి.భార్గవ్‌సూర్య, సీహెచ్.సూరజ్ ప్రీతమ్, వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. డబుల్స్‌లో పి.భార్గవ్‌సూర్య–ఎస్.పాల్‌సుధాకర్ జోడీ విజయం సాధించగా, సీహెచ్.సూరజ్‌ప్రీతమ్ – జె.కుశాల్ జోడీ ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు మంగళవారం బహుమతుల ప్రధానం చేస్తామని చీఫ్ కోచ్ శ్రీరాములు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

గజపతినగరం: రోజురోజుకీ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కె.లక్ష్మణరావు సూచించారు. మండల కేంద్రంలోని మేదర వీధిలో స్థానికులకు సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లకు పంపించే లింకులపై క్లిక్ చేయవద్దన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డుల వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ఆన్‌లైన్ షాపింగ్స్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మత్తు పదార్థాలకు బానిసగా మారి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని సూచించారు. గంజాయి వినియోగించినా, రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వివాదాల జోలికి పోవద్దన్నారు. పోలీస్ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

శిక్షకుడిగా పెదకాద కార్యదర్శి



జగన్నాథం

దత్తిరాజేరు: పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది, పంచాయతీ సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చే సామర్లకోటలోని శిక్షణ కేంద్రం శిక్షకుడిగా దత్తిరాజేరు మండలం పెదకాద పంచాయతీ కార్యదర్శి వి.జగన్నాథం ఎంపికయ్యాడు. ఈ మేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. ఏప్రిల్ 1న శిక్షకుడిగా విధుల్లో చేరుతానని చెప్పారు.

అడిగే వారెవరు.. అడ్డుకునేదెవరు..?

- కూటమి సర్కారులో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- డీసీఎంఎస్ స్థలంలో మళ్లీ ప్రారంభమైన అక్రమ నిర్మాణాలు
- ఆర్‌అండ్‌బీ స్థలాల్లోనూ అదే తీరు



చీపురుపల్లి పట్టణంలోని డీసీఎంఎస్ స్థలంలో అక్రమ నిర్మాణాలు

చీపురుపల్లి:

మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగిపోతోంది. ఏం చేసినా చూసే వారెవరు....అడిగే వారెవరు అన్న చందంగా కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు తయారయ్యాయి. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు ఆక్రమణదారులు పాగా వేసేస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆ స్థలాలు ప్రభుత్వానివి అనే కనీస స్పృహ, ఏ మాత్రం భయం లేకుండా వాటిలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం నుంచి కఠిన చర్యలు లేకపోవడంతో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. చీపురుపల్లి పట్టణంలోని విజయనగరం-పాలకొండ ప్రధాన రహదారిని ఆనుకుని మెయిన్ రోడ్‌లో ఉన్న డీసీఎంఎస్(డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) స్థలం ఆక్రమణలకు గురవుతోంది. కొద్ది నెలల క్రితం అక్కడ ఖాళీగా ఉన్న స్థలంలో ఆక్రమణదారు ఓ రెండు దుకాణాల నిర్మాణ పనులు ప్రారంభించారు. అదే సమయంలో డీసీఎంఎస్ అధికారులు వచ్చి అక్రమ కట్టడాలు నిలిపివేసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆక్రమణదారులు కొద్ది రోజులు విరామం తీసుకుని, తాజాగా మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభించారు. వీరిని చూసిన మరికొంతమంది అదే స్థలంలో మరో ఏడు దుకాణాల నిర్మాణానికి మార్కింగ్‌లు కూడా ఇచ్చారు. ప్రస్తుతం పట్టణంలో ఈ విషయం చర్చనీయాంశమయ్యింది. తహసీల్దార్ కార్యాలయానికి అతి చేరువలో ఈ అక్రమ కట్టడాలు జరుగుతుండడం గమనార్హం. కొద్ది రోజుల క్రితమే మండలంలోని పత్తికాయవలస జంక్షన్ వద్ద ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలు చేపట్టిన సంగతి తెలిసిందే. తహసీల్దార్, ఆర్‌అండ్‌బీ అధికారులు వెళ్లి నిర్మాణాలు నిలిపివేయాలని హెచ్చరించినప్పటికీ పనులు ఆపలేదు. ఇలా ఆర్‌అండ్‌బీ, డీసీఎంఎస్ స్థలాల్లో దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకునే నాథుడే లేడా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.



కొద్ది రోజుల క్రితమే అక్రమ నిర్మాణాలు పరిశీలించి నిలిపివేయాలని హెచ్చరించిన డీసీఎంఎస్ అధికారులు(ఫైల్)



పత్తికాయవలస జంక్షన్‌లో ఆర్‌అండ్‌బి స్థలంలో దుకాణాల నిర్మాణం(ఫైల్)

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలోని వెంకట్రామా పొల్ట్రీస్ పరిశ్రమలో తొలగించిన కార్మికులందరినీ యాజమాన్యం తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమ యాజమాన్యం చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోం దంటూ శ్రీగంగాభవానీ వెంకట్రామా పౌల్ట్రీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు అంబల్ల గౌరునాయుడు, అధ్యక్షుడు బి.గురునాయుడు, ప్రధాన కార్యదర్శి టి.ఈశ్వరరావుతో పాటు సీఐటీయూ నాయకులు, ఎస్‌ఎఫ్‌ఐ తదితర సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పౌల్ట్రీస్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని తీర్మానించారు. అలాగే చట్ట ప్రకారం 75 శాతం ఉద్యోగ అవకాశాలు స్థానిక యువతకే కల్పించాలని కోరారు. కార్మికులు న్యాయమైన కోర్కెలు కోరడం తప్పా అని ప్రశ్నించారు. వేతన సవరణ చేస్తామని హామీ ఇచ్చి అడిగినందుకు కార్మికులను యాజమాన్యం చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి బదిలీ చేసిందని, అంత దూరం వెళ్లలేమని చెబితే ఏకంగా విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఇక్కడ పరిశ్రమలో 300 మంది కార్మికులు మాత్రమే స్థానికులు ఉండగా అత్యధికంగా 700 మంది వరకు స్థానికేతరులే ఉద్యోగాల్లో ఉన్నారని చెప్పారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



సంకల్ప రథంలో ప్రదర్శిస్తున్న లఘుచిత్రాలను తిలకిస్తున్న మెరకముడిదాం కేజీబీవీ విద్యార్థినులు

మెరకముడిదాం: యువత మత్తుపదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని బుధరాయవలస ఎస్‌ఐ జె.లోకేశ్వరరావు సూచించా రు.మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై సంకల్పరథం ద్వారా మెరకముడిదాం కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), భైరీపురం, తదితర గ్రామాల్లో సోమవారం అవగాహన కల్పించారు.డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరిస్తూ రూపొందించిన లఘుచిత్రాలను ప్రదర్శించారు. ఎస్‌ఐ లోకేశ్వరరావు మాట్లాడుతూ సరదాగా ప్రారంభించిన మాదకద్రవ్యాల వినియోగం, క్రమంగా అలవాటుగా మారి చివరికి వ్యసనంగా మారుతుందన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఇలాంటి వ్యసనాలకు బానిసలుగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదకద్ర వ్యాలకు అలవాటు పడిన కొందరు దొంగతనాలకు కూడా పాల్పడుతున్నారని చెప్పారు. అలాగే మొబైల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి అప్పులపాలై కుటుంబాలను రోడ్డు మీదకు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బొండపల్లి: మండల కేంద్రంలో బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయానికి తరలివచ్చి పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సుమారు 5వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

శృంగవరపుకోట:

పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు ముగియడంతో ఎస్.కోట పట్టణంలో ముస్లింలు రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లిం వీధిలోని జామియా మసీదులో తెల్లవారు జామున 5 గంటలకు ఫజర్ నమాజ్ నిర్వహించారు. అనంతరం ఇళ్లకు చేరుకున్న ముస్లింలు ఇళ్ల వద్ద సిద్ధం చేసిన హాథియాను కుటుంబ సభ్యులంతా సంతోషంగా పుచ్చుకున్నారు. అనంతరం ఉదయం 9గంటల సమయంలో స్థానిక జామియా మసీదు నుంచి ముస్లింలు అంతా పుణ్యగిరి రోడ్డులోని బర్మాకాలనీ వద్ద ఉన్న ఈద్‌గా వద్దకు ఊరేగింపుగా బాణాసంచాతో, బ్యాండ్‌మేళాలతో చేరుకున్నారు. ఇమామ్ మహ్మద్ అఫ్తాఫ్ అహ్మద్ నేతృత్వంలో ఈద్‌గా లో ప్రార్థనలు చేశారు అనంతరం పరస్పర ఆలింగనాలతో ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుతూ పండ్ల రసం పంపిణీ చేశారు.ఇళ్ల వద్ద బంధువులు, స్నేహితు లకు విందు భోజనాలు ఏర్పాటు చేసి ఆనందంగా గడిపారు.

గంట్యాడలో..

గంట్యాడ: రంజాన్ పండగ సందర్భంగా మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలు సోమవారం ప్రార్థనలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ముస్లింలు అంతా మండల కేంద్రంలోని మసీదుకు వచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు.



శృంగవరపుకోట: ఎస్.కోటలోని ఈద్‌గాలో ఖురాన్ ప్రవచిస్తున్న ఇమామ్ అఫ్తాఫ్ అహ్మద్

గజపతినగరంలో..

గజపతినగరం: పురిటిపెంట గ్రామంలోని ముస్తఫా మసీదులో ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం ఇఫ్తార్ విందు చేశారు.

ఎల్.కోట, కొత్తవలస మండలాల్లో..

లక్కవరపుకోట /కొత్తవలస: ఎల్.కోట, కొత్తవలస మండలాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎల్.కోట మక్కా మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. రాష్ట్ర నూర్ సాహిబ్, దూదేకుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్.కే.మదీన పాల్గొన్నారు. కొత్తవలస హైస్కూల్ మైదానంలో టెంట్లు ఏర్పాటు చేసి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



గజపతినగరం: పురిటిపెంటలోని ముస్తఫా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లక్కవరపుకోట: ఎల్.కోటలోని మక్కా మసీదులో ప్రార్థనలు



కొత్తవలస: కొత్తవలస హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన టెంట్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గంట్యాడ: గంట్యాడ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాములోరి పెళ్లికి గోటి తలంబ్రాలు



శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా సీతారాముల పెళ్లికి ఎస్.కోటలోని మహావతార్ బాబాజీ, మాతాజీ ఆశీస్సులతో కుసుమ హరనాథ్ కోవెలలో మహిళా భక్తులు ధాన్యాన్ని గోటితో ఒలిచి తలంబ్రాలుగా మార్చారు. ఈతలంబ్రాలను ఎస్.కోటలోని పెద్దవీధి, చిన్నంనాయుడు రామమందిరాలకు, అలాగే అయోధ్య, భద్రాచలం పంపతున్నట్టు భక్తురాలు కొల్లా పుష్పరాణి తెలిపారు.

– శృంగవరపుకోట

ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన



రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎల్.కోట మండలంలోని మార్లాపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన లేగ దూడల ప్రదర్శన పోటీలు ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన 78 మంది పాడిరైతులు 90 దూడలను ప్రదర్శించారు.ఆరోగ్యకరంగా, ఆకర్షణీయంగా ఉన్న మూడు దూడలను పశువైద్యులు ఎంపిక చేశారు.వాటి యజమానులకు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పశుసంవర్ధకశాఖ జేడీ వై.వి.రమణ మాట్లాడుతూ నేటి దూడలే రేపటి పాడి సంపద అని అన్నారు. రైతులు తమ పాడిపశువులకు రూ.360తో బీమా చేయించుకోవాలని సూచించారు. రాయితీపై గడ్డి విత్తనాలను అందజేస్తున్నామని చెప్పారు. సర్పంచ్ గోకేడ సత్యం, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, పశుసంవర్ధకశాఖ కొత్తవలస ఏడీ బి.గంగాధర్, పశువైద్యులు జగదీష్, సింగంపల్లి సత్యనారాయణ,కోరాడ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

–లక్కవరపుకోట

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

గంట్యాడ: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.హెచ్. వి.లక్ష్మీకుమారి అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.విద్యార్థినులకు పోక్సో తదితర చట్టాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి మాట్లాడుతూ బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. బాల,బాలికలకు న్యాయ వ్యవస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని, బాలల హక్కులు కాపాడడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముందుంటుందని తెలిపారు. పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థినులకు సూచించారు. బాల, బాలికలపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు తప్పవన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ లాయర్లు వి. శ్రీదేవి, జి. రాముడు ప్పడు, సర్వశిక్ష అభియాన్ ఏపీసీడాక్టర్ ఏ.రామారావు, కేజీబీవీ ఎస్‌ఓ అల్లు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కవులు, కళాకారులకు సన్మానం



జానపద కళాకారిణి జ్యోతిని సన్మానిస్తున్న చైతన్య భారతి సంస్థ, లయన్స్ క్లబ్ సభ్యులు, సీఐ జి.ఏ.వి.రమణ

గజపతినగరం: స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో చైతన్య భారతి సాహితి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉగాది వేడుకలు, కవితా గానం నిర్వహించారు. అతిథిగా హాజరైన సీఐ జి.ఏ.వి.రమణ మాట్లాడుతూ సామాజిక చైతన్యం కలిగించేలా కవులు తమ రచనలు చేయాలని, చెడు మార్గంలో పయనిస్తున్న, వ్యసనాలకు బానిసగా మారుతున్న యువతను మేల్కొలిపే విధంగా రచనలు చేయాలని అన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలో బంగారు పతకాన్ని సాధించిన చైతన్య భారతి సాహితి సాంస్కృతిక సంస్థ గజపతినగరం సర్కిల్ పరిధిలో ఉండడం ఆనందంగా ఉందని, ఆ సంస్థ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటశ్రీరామ్ (రామ్ జీరాజు)ను సీఐ అభినందించారు. అనంతరం పలువురు కవులు, రచయితలు, కళాకారులకు ఉగాది పురస్కారాలు అందజేసి, సన్మానించారు.అలాగే జముకుల కళాకారిణి గంటా జ్యోతికి జానపద రత్న అనే బిరుదును చైతన్య భారతి సంస్థ ప్రదానం చేసింది. లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్, శ్రీనివాస నర్సింగ్‌హోమ్ డైరెక్టర్ బెల్లాన లక్ష్మీనరేన్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ వి.కృష్ణారావు, గంధ్రేటి లక్ష్మణరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు బొంతలకోటి శంకరరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు మరడాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

దత్తిరాజేరు: బీసీ కార్పొరేషన్ రుణాలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 2వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 17గ్రామ సచివాలయాల పరిధిలో 362 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని స్పష్టం చేశారు. వీరిలో 18 గ్రామాల వారికి బుధవారం ఉదయం, 17 గ్రామాల వారికి మధ్యాహ్నం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

శాశ్వత కల్వర్టు నిర్మించరూ..



ఈ ఏడాది జనవరి 12న కల్వర్టు కూలిపోయిన దృశ్యం



జనవరి15న తాటిదుంగలతో ఏర్పాటు చేసిన తాత్కాలిక కల్వర్టు



మార్చి 16న మెటల్ లోడ్‌తో లారీ వెళ్లడంతో కూలిన తాత్కాలిక కల్వర్టు



తాత్కాలిక కల్వర్టులో మిగిలిన కొద్దిభాగం మీదుగా రాకపోకలు

వేపాడ: మండలంలో బల్లంకి నుంచి ఆనందపురం వెళ్లే రహదారిలో రైవాడ కాలువపై ఉన్న కల్వర్టు ఈ ఏడాది జనవరి 12న కూలిపోయింది. దీంతో గ్రామస్తులు అదే నెల 15వ తేదీన తాత్కాలికంగా చిన్న వాహనాలు రాకపోకలకు సాగించేందుకు ఇబ్బందులు లేకుండా తాటిదుంగలతో కల్వర్టు ఏర్పాటు చేశారు. అయితే పదిహేను రోజుల క్రితం వావిలపాడు నుంచి విశాఖప ట్నం మెటల్ లోడుతో వెళుతున్న లారీలు తాత్కాలిక కల్వర్టుపైకి రావడంతో కల్వర్టు సగం కూలిపోయింది. మిగిలిన కొద్ది భాగం కల్వర్టుపై నుంచే ప్రస్తుతం ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళుతున్నాయి. అయితే అది కూడా ఏ సమయంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రైవాడ కాలువ నిర్వహణ చూసే జీవీఎంసీ అధికారులు స్పందించి శాశ్వత కల్వర్ట్ నిర్మాణం చేపట్టాలని ఆమార్గంలో ప్రయాణించే వారు కోరుతున్నారు.